క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పక్కాగా అమలు



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పలరాజు

దేవరాపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో గ్రామాల్లో పక్కాగా నిబంధనలు అమలు చేయాలని దేవరాపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.అప్పలరాజు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి.సంతోషినళినితో కలిసి బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. జూలై 30 నుంచి కోడ్ అమల్లోకి వచ్చినందుకు గ్రామాల్లో అన్ని రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, జెండాలను తొలగించి, రాజకీయ ప్రముఖుల విగ్రహాలకు ముసుగు వేయాలని సూచించారు. పింఛన్ల పంపిణీని గురువారం తెల్లవారుజాము నుంచి ప్రారంభించాలని మ్యాపింగ్ చేసిన అధికార్లు, పంచాయతీ సెక్రటరీలకు తెలిపారు.

ఫ్లూ జ్వరాలపై అప్రమత్తత అవసరం



డాక్టర్ లక్ష్మీకాంత్

నర్సీపట్నం: ఫ్లూ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం నాయకుడు, చిన్నపిల్లల వైద్య నిపుణుడు డా.లక్ష్మీకాంత్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫ్లూ జ్వరాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. ఫ్లూ జ్వరాల పట్ల ప్రజలను మీడియా ద్వారా అప్రమత్తం చేసేందుకు తన వంతు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. వాతావరణంలో మార్పులతో పాటు, భారీగా కురుస్తున్న వర్షాలకు ఫ్లూ జ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నారు. చిన్నపిల్లలు, 60 ఏళ్ల దాటిన వృద్ధులు ఎక్కువగా వీటి బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు. దీని ప్రభావం జూన్ నుంచి అక్టోబర్ నెలాఖరు వరకు ఉంటుందన్నారు. జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, వీరేచనాలుంటే ఫ్లూ లక్షణాలుగా జాగ్రత్త పడాలన్నారు. నర్సీపట్నం పరిసర ప్రాంతంలో వారం రోజులుగా ఈ జ్వర బాధితుల సంఖ్య పెరుగుతున్నట్లు తెలిపారు. తగు జాగ్రత్తలు తీసుకుని వైద్యం పొందితే తగ్గుముఖం పడుతుందన్నారు.

కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన తప్పనిసరి



కుష్టు లక్షణాల అనుమానితుల్ని పరీక్షిస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు: శరీరంపై రాగి రంగు మచ్చలతో పాటు స్పర్శలేని మచ్చలున్న వారు వైద్య సిబ్బందిచే కుష్టు వ్యాధి నిర్ధారిత పరీక్షలను చేయించుకోవాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల కోరారు. కె.కోటపాడు హెల్త్ సబ్ సెంటర్ వద్ద బుధవారం కుష్టువ్యాధి లక్షణాల అనుమానితులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు కుష్టును ప్రాథమిక దశలో గుర్తిస్తే వైకల్యం బారిన పడకుండా చికిత్స పొందవచ్చన్నారు. కుష్టు రోగులకు ఇంటి వద్దే అవసరమైన ఎండీటీ మాత్రలను తమ సిబ్బంది అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు నళిని, ఎంఎల్‌హెచ్‌పీ ఉమ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా వంతెన



సింగన్నదొరపాలెం వద్ద రక్షణ గోడలు లేని వంతెన

కె.కోటపాడు: సింగన్నదొరపాలెం సమీపంలోని మొండిగెడ్డ వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. 25 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు శిథిలావస్థకు చేరి పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో ఎదురెదురుగా వాహనాలు ప్రయాణించే సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వంతెనకు రెండు వైపులా రక్షణ గోడలు నిర్మించి, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

అందరి సహకారంతో మండలాభివృద్ధికి కృషి

- అభినందన సభలో ఎంపీపీ బుల్లిలక్ష్మి



సన్మానం అనంతరం ఎంపీపీ బుల్లిలక్ష్మి దంపతులతో మండల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు

దేవరాపల్లి: మండల ప్రజాప్రతినిధులు, అధికారుల సహాయ సహకారాలతో మండలాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని దేవరాపల్లి ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అన్నారు. ఇటీవల ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రైవాడ ఎరకాలమ్మ ఆలయ సమీపంలో స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబురావు అధ్యక్షతన బుధవారం అభినందన సభ ఘనంగా జరిగింది. ముందుగా ఎంపీపీ బుల్లిలక్ష్మి, సత్య వెంకటరమణ దంపతులు తారువలో మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును కలిసి, ఆశీస్సులు తీసుకున్నారు. వారిని బూడి ఘనంగా సత్కరించి, అభినందించారు. అనంతరం ఎరకాలమ్మ ఆలయం వద్ద జరిగిన అభినందన సభలో ఎంపీపీ దంపతులకు బూడి సతీమణి రమణమ్మతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలు వేసి, ఘనంగా సత్కరించారు. ఎ.కొత్తపల్లి వైఎస్సార్‌సీపీ శ్రేణులు తెచ్చిన కేక్‌ను కట్ చేసి, పార్టీ నాయకులకు తినిపించారు. సమష్టి కృషితో మండలాన్ని అభివృద్ధి చేసి, ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేద్దామని సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఉగ్రాకుల గంగాభవాని, ఎంపీటీసీలు రొంగలి నారాయణమ్మ, పంచాడ సింహాచలంనాయుడు, పోతల వెంకటరావు, మజ్జి దేవి, రుత్తల లక్ష్మి, బొడ్డు లక్ష్మి, పాటేల ఈశ్వరమ్మ, బండి గౌరమ్మ, కోలా గోపి, నాయకులు డా.వరదపురెడ్డి సింహాచలంనాయుడు, కర్రి సూరినాయుడు, కేవీ రమణ, గొర్రుపోటు రమాదేవి తదితర సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి సర్పంచ్‌గా చారుమతీదేవి



సర్పంచ్ చారుమతీదేవిని అభినందిస్తున్న ఎంపీపీ రాజారాం, ఎంపీడీవో కాళీప్రసాదరావు

మాడుగుల రూరల్: ఎం.కృష్ణాపురం గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్‌గా వడ్డాది చారుమతీదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి సర్పంచ్ మెల్లి రాజేశ్వరి వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారు. జిల్లా పంచాయితీ అధికారి ఉత్తర్వుల మేరకు బుధవారం ప్రజల సమక్షంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్థానికులు చారుమతీదేవిని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా దేశం పార్టీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, మండల పార్టీ నేతలు అద్దిపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, మజ్జి తాతబాబు, జనసేన నాయకులు రాయపురెడ్డి కృష్ణ, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, బీజేపీ నాయకులు పుట్టా గంగయ్య, గొల్లవిల్లి రాజేష్, శానాపతి రాము తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఎంపీపీ రాజారామ్, ఎంపీడీవో కాళీప్రసాదరావు, మండల పంచాయతీ విస్తరణాధికారి మీనాకుమారి తదితరులు చారుమతీదేవిని అభినందించారు.

మండల సర్వ సభ్య సమావేశం రేపు

దేవరాపల్లి: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని శుక్రవారం స్థానిక నూతన ఎంపీడీవో భవనంలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.అప్పలరాజు తెలిపారు. స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని అనుసరించి ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కానుందన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. అన్ని శాఖల మండల, గ్రామ స్థాయి అధికారులు తగు సమాచారంతో సమావేశానికి హాజరు కావాల్సిందిగా కోరారు.

పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికల నగారా



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవోలు సత్యనారాయణ, ప్రసాద్.

కె.కోటపాడు: మండలంలోని 52 స్కూళ్లలో పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)ల ఎన్నికలను ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించేందుకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ఎంఈవోలు సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ అవగాహన కల్పించారు. కె.కోటపాడులోని ఎంఆర్‌సీ కార్యాలయంలో బుధవారం ఎస్ఎంసీ ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఆగస్టు 1న నోటీస్ బోర్డులో ఓటర్ల జాబితా ప్రకటించి, మధ్యాహ్నం 2 గంటలకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి, వాటికి పరిష్కారం చూపాలన్నారు. 5న నోటీస్ బోర్డులో తుది ఓటర్ల జాబితాను ప్రదర్శించి, అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల మధ్య ఎస్ఎంసీ సభ్యుల ఎన్నికలను నిర్వహించాలన్నారు. 8న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికతోపాటు, సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించాలని సూచించారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు కమిటీతో సమావేశాన్ని నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

8న ఎస్ఎంసీ ఎన్నికలు

మాడుగుల రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీలకు వచ్చే నెల 8న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఈవో బి.దేముడమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలల వారీగా సంబంధిత ప్రధానోపాధ్యాయులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. 1న నోటిఫికేషన్ జారీ చేసి, ఓటర్ల జాబితా ప్రకటన, 5న అభ్యంతరాల పరిష్కారం తదితర కార్యక్రమాలు పూర్తి చేసి, 8న ఎన్నికలు నిర్వహించాలన్నారు.

హెచ్‌ఎంలు ఏర్పాట్లు చేయాలి

రోలుగుంట: 2024–25 విద్యా సంవత్సరానికిగాను పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు 8న నిర్వహించేందుకు విద్యాశాఖ సన్నద్ధమైనట్లు ఎంఈవో జాను ప్రసాద్ తెలిపారు. ఈ ఎన్నికల్లో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఎన్నికల తేదీలు, ఓటర్ల జాబితా, ఎన్నికల ప్రక్రియపై ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలు తగు ఏర్పాట్లు చేయాల్సిందిగా సూచించారు.

సీసీఆర్ కార్డులతో కౌలు రైతులకు భద్రత



కౌలు రైతులకు కార్డులను అందిస్తున్న మండల వ్యవసాయాధికారి సోమశేఖర్

కె.కోటపాడు: క్రాప్ కల్టివేటర్ రైట్ కార్డు(సీసీఆర్‌సీ)ల ద్వారా కౌలు రైతులు పండించే పంటలకు పూర్తి భద్రత దక్కనున్నట్లు మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. ఎ.కోడూరు రైతు సేవా కేంద్రంలో అర్హత గల భూ యజమానుల అంగీకార పత్రంతో వారి భూ హక్కులకు ఎటువంటి భంగం లేకుండా ముగ్గురు కౌలు రైతులకు బుధవారం సీసీఆర్ కార్డులను అందించారు. ఏవో సోమశేఖర్ మాట్లాడుతూ ఈ కార్డులున్న కౌలు రైతులకు రాయితీపై విత్తనాలు, ఎరువుల అందడంతోపాటు, రైతు సేవా కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధరకు పంటలను విక్రయించుకోవచ్చన్నారు. పంట నష్ట పరిహారానికి కూడా అర్హులన్నారు. మండలంలోని 20 రెవెన్యూ గ్రామాల్లో 70 మంది రైతులకు ఈ కార్డులను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఎంపీఈవో విజయ్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ బాధితుడికి ఆర్థిక సాయం



సతీష్‌రాజ్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహాంజలి ఫర్ పూర్ సంస్థ సభ్యులు

మాడుగుల రూరల్: మండలంలోని ఎం.కోడూరుకు చెందిన గొర్లె సతీష్‌రాజ్(24) ఏడాది క్రితం విద్యుత్ షాక్‌కు గురై మంచానపడ్డాడు. పేదరికంతో వైద్యం చేయించుకోలేని పరిస్థితి. దీంతో సతీష్‌రాజ్‌ను స్నేహాంజలి ఫర్ పూర్ సంస్థ సభ్యులు బుధవారం పరామర్శించి, వైద్యం కోసం రూ.10 వేలు నగదు సాయం చేశారు. సంస్థ సభ్యులు పెంకి శివ, తలుపులయ్య, ప్రసాదు భోగేష్ పాల్గొన్నారు.

దళితుల శ్మశానవాటికలో ఆక్రమణలు తొలగించండి

చీడికాడ: మండలంలోని చుక్కపల్లిలో దళితులకు కేటాయించిన శ్మశానవాటికలో ఆక్రమణలను తొలగించి, శ్మశాన వాటికను దళితులకు అప్పగించాలని పౌర హక్కుల సంఘం నేత మరువాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా చుక్కపల్లి దళితవాడలో సమావేశం నిర్వహించారు. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. స్థానికులు మాట్లాడుతూ తమకు పదేళ్ల క్రితం అప్పటి తహసీల్దార్ రెండెకరాల భూమిని శ్మశాన వాటిక కోసం అందించగా, అది ఆక్రమణలకు గురైందన్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏఓ, ఆర్ఐ బొంజుబాబు, సచివాలయ మహిళా పోలీసు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంటరానితనం నిర్మూలనకు కృషి

నాతవరం: అంటరానితనాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా ప్రతి నెల పౌరహక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాంబాబు తెలిపారు. మండల కేంద్రం ఎరుకుల కాలనీలో బుధవారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ కుల వివక్ష లేకుండా అన్ని వర్గాల ప్రజలూ ఐక్యంగా ఉండాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున వ్యక్తిగత శుభ్రతతోపాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం కాలనీలోని ప్రధాన సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి ఎస్ఎస్‌వీ మూర్తి, నాతవరం ఎస్సీ హాస్టల్ వార్డెన్ రొంగలి శివ, పంచాయతీ కార్యదర్శి శ్రీను, వీఆర్వో బొత్సా శ్రీను, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎంఈవో పదవీ విరమణ వేడుక



ఉద్యోగ విరమణ చేసిన ఎంఈవో జయలక్ష్మి దంపతుల్ని సత్కరిస్తున్న సిబ్బంది

చోడవరం రూరల్: ఉద్యోగ బాధ్యతల్లో తన చివరి రోజు విధుల్ని పూర్తి చేసుకున్న మండల విద్యాశాఖాధికారి ఎస్.జయలక్ష్మి తమందరికీ అన్ని వేళలా మార్గదర్శనం చేసేవారని సహోద్యోగులు, సిబ్బంది కొనియాడారు. బుధవారం ఆమె ఉద్యోగ విరమణ సందర్భంగా ఎంఈవో జయలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. ఎంఈవో–2 కె.సింహాచలం మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేస్తున్న ఆమె పట్టుదల, సమయపాలన, అంకితభావం ఉద్యోగులకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో కె.వి.మహాలక్ష్మినాయుడు, సుబ్రహ్మణ్యం, రవి శంకర్, శిరీష, నాగలక్ష్మి, భూలక్ష్మి, సరోజిని, చంద్రికలతోపాటు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో..

ఉద్యోగ విరమణ చేసిన ఎంఈవో ఎస్.జయలక్ష్మి దంపతులను ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించింది. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన సత్కారసభకు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.మహాలక్ష్మినాయుడు, మండలశాఖ ప్రతినిధులు గొల్లు శ్రీనివాసరావు, కె.మల్లేశ్వరరావు, ఆర్‌వీఎస్ సత్యనారాయణ, చిరంజీవి, కిషోర్ తదితరులు పాల్గొని ఎంఈవో దంపతులను సత్కరించారు.

సమాజాన్ని తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే



హెచ్‌ఎం నాగేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీలు రఘువర్మ, చిరంజీవి, స్థానిక ప్రజాప్రతినిధులు

చోడవరం: సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుడు ఎంతో కీలకమని, అలాంటి ఉత్తమ ఉపాధ్యాయుల్లో వెదురుపర్తి నాగేశ్వరరావు మాస్టారు ఒకరని ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీలు పాకలపాటి రఘువర్మ, వేపాడ చిరంజీవి కొనియాడారు. రావికమతం మండలం దొండపూడి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం నాగేశ్వరరావు పదవీవిరమణ సందర్భంగా హైస్కూల్ ఆవరణలో బుధవారం వీడ్కోలు సభ నిర్వహించారు. నాగేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీవైఈవో అప్పారావు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్, ఎంపీటీసీ కొప్పాక లక్ష్మి, సర్పంచ్ రాజులమ్మ, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ సిరిసోల్ల తమ్మునాయుడు, జీపీఎస్ నాయుడు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

మాడుగుల రూరల్: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ గురువారం ఉదయం నుంచి అన్ని గ్రామాల్లో చేపట్టనున్నట్లు ఎంపీడీవో ఆర్.కాళీప్రసాదరావు బుధవారం తెలిపారు. మండలంలో 11,803 మంది పింఛనుదార్లకు గాను రూ.5 కోట్లు, 12 లక్షల 73 వేల రూపాయలు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మండలంలోని 23 గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న 174 మంది సచివాలయ ఉద్యోగులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పింఛన్లు పంపిణీ చేస్తారని, మిగిలిన వారికి రెండో తేదీన పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గత నెల్లో 117 మంది పింఛనుదార్లు మృతి చెందారని పేర్కొన్నారు.

చిగుర్లు తుంచి వరి నాట్లు వేసుకోవాలి



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి వాసుదేవరావు

మాడుగుల: వరి నారు చిగుర్లు తుంచి నాట్లు వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు సూచించారు. బుధవారం మండలంలోని సాగరం గ్రామంలో జరుగుతున్న ఖరీఫ్ వరి నాట్ల తీరును పరిశీలించి, రైతులకు సలహాలు, సూచనలు అందించారు. వరి నారు దశలో చిగుర్లలో ఆకుముడత పురుగులు గుడ్లు పెడతాయని, చిగుర్లు తుంచకుండా వరి నాట్లు వేసుకుంటే వారం రోజుల్లో వరి నాట్లకు తెగుళ్ల సోకే ప్రమాదం ఉందన్నారు. చిగుర్లు తుంచి నాట్లు వేస్తే నెల రోజుల వరకు ఆకుముడుత తెగుళ్ల ఆశించకుండా చూసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా ధర్మశ్రీ జన్మదిన వేడుకలు



మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న చోడవరం నాయకులు



రావికమతంలో ధర్మశ్రీ పుట్టిరోజు వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చోడవరం/రావికమతం/బుచ్చెయ్యపేట: మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పుట్టినరోజు సందర్భంగా బుధవారం సామాజిక కార్యక్రమాలతో సందడిగా వేడులు జరిగాయి. చోడవరంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి, స్వీట్లు పంచిపెట్టారు. ప్రజల మనిషిగా జనం హృదయాల్లో ధర్మశ్రీ సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని పార్టీ నాయకులు కొనియాడారు. గాజువాకలో ఉన్న ధర్మశ్రీని చోడవరం వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, పార్టీ జిల్లా ప్రతినిధి పప్పల జయదేవ్, ఎంపీపీ గాడి కాసు, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, సర్పంచ్‌లు మూడెడ్ల శంకరావు, పోతల జానకీప్రసాద్, కొరకూటి భోగేష్, ఉగ్గిన నాగబాబు, శిరుచోళ్ల గణపతినాయుడు, శానాపతి రాజశేఖర్, బలిరెడ్డి నాగేశ్వరరావు, బూరే మాణిక్యం, శీరంరెడ్డి వెంకటరమణ, దంతులూరి శ్రీనివాసరాజు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మొల్లి సోమునాయుడు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, మాజీ జెడ్పీటీసీ బొడ్డేడ సూర్యనారాయణ పాల్గొన్నారు.

రావికమతంలో...

మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా రావికమతంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి వేడుకలు జరిపారు. ఇక్కడి ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్, మండల అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, ఎంపీపీ పైల రాజు, మాజీ మండలాధ్యక్షుడు కంచిపాటి జగ్గారావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ్, వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, మత్సా భవానీ ప్రసాద్ పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో..

మాజీ ప్రభుత్వ విప్ ధర్మశ్రీ జన్మదినం సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరీదేవి, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి జోగా కొండబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నమ్మి అప్పలరాజు, ముచ్చకర్ల అప్పారావు, కోరుకొండ అప్పలనాయుడు, పెదిరెడ్ల మాణిక్యం, సుంకరి గాంధీ, శ్రీను, మోటూరి చిన్నంనాయుడు తదితరులు ధర్మశ్రీని కలిసి సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

కసిమిలో వైద్య శిబిరానికి స్పందన



గిరిజనులకు వైద్యం అందిస్తున్న సిబ్బంది

గొలుగొండ: మండలంలోని కసిమి గ్రామంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. చీడిగుమ్మల వైద్యాధికారి ధనుంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి కసిమి, చిన కసిమి, దోనిపాలెం, రుత్తలపాలెం తదితర గ్రామాల నుంచి ప్రజలు వచ్చి, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి వైద్యులు ఉచితంగా మందులు అందించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్లలో నిల్వనీరు లేకుండా చూడాలని, దోమ తెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాస్, వెంకటలక్ష్మి, లోవలక్ష్మి, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కె.కోటపాడు: గొండుపాలెం ఫీడర్ పరిధిలోని నాలుగు గ్రామాల్లో ఈ నెల 2న శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఏఈ చంద్రశేఖర్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లలో మరమ్మతు పనుల నేపథ్యంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. గొండుపాలెం, గుల్లేపల్లి, చౌడువాడ, మల్లంపాలెం గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, సహకరించాల్సిందిగా కోరారు.

రత్నంపేట ఫీడర్ పరిధిలో..

రోలుగుంట: నర్సీపట్నం డివిజన్ 11కేవీ రత్నంపేట ఫీడర్ పరిధి గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ డీవీ రామకృష్ణారావు బుధవారం తెలిపారు. దీంతో రత్నంపేట, బీ.బీ.పట్నం, ఎంకే పట్నం, చటర్జీపురం తదితర గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

మహిళలకు అండగా మానస మహాలక్ష్మి పొదుపు సంఘం



సమావేశంలో మాట్లాడుతున్న పుట్టా గంగయ్య, చిత్రంలో పరమేశ్వరరావు, తదితరులు

మాడుగుల: గత 25 ఏళ్లు మానస మహాలక్ష్మి పొదుపు సంఘం స్థానిక మహిళలకు పొదుపు అలవాటు చేయడంతో పాటు, వారిని ఆర్థికంగా ఆదుకుంటోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా ఇన్‌చార్జి పుట్టా గంగయ్య తెలిపారు. బుధవారం స్థానిక పొదుపు సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు. డబ్బు పొదుపుతోపాటు, మనం వాడే నీటి దగ్గర నుంచి ప్రతి వినియోగంలో పొదుపును పాటించాలన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి మహిళలు సహకరించాలన్నారు. సంఘ సీఈవో పరమేశ్వరరావు కృషిని అభినందించారు. సీఈవో పరమేశ్వరరావు మాట్లాడుతూ పాతికేళ్ల క్రితం 101 మందితో మొదలైన ఈ సంఘంలో ప్రస్తుతం 4 వేల మంది సభ్యులుగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు, సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వరినాట్లు



దారగెడ్డ దిగువన దమ్ము పడుతున్న రైతు

గొలుగొండ: మండలంలోని విప్పలపాలెం ఆయకట్టు, రావణాపల్లి జలాశయం, దారగెడ్డ దిగువున ముమ్మరంగా వరి నాట్లు జరుగుతున్నాయి. ఈ మూడు ప్రాంతాల్లో సుమారు 4 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. నీటి సౌకర్యం అధికంగా ఉండటం వలన ఏటా ఖరీఫ్ సీజన్లో ఇక్కడ ముందుగా నాట్లు వేస్తారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు కూడా రైతులకు కలిసొచ్చాయి. దీంతో ప్రస్తుతం దమ్ములు, నాట్లు వేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఈ ఏడాది మెరక ప్రాంతాల్లో సైతం నాట్లు వేస్తుండటంతో సాధారణ సాగు కంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగు జరిగే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెప్తున్నారు.

IN THE HONOURABLE COURT OF
THE IX ADDITIONAL DISTRICT JUDGE
AT CHODAVARAM
E.P. 7/2022 IN O.S. 91/2011

BETWEEN:-
Margadarsi Chit Fund Private Limited
Rep. by its Branch Manager, K.Ramakrishna
Seethammapeta Branch, Visakhapatnam ... Petitioner/DHR
And
V.Srinivasa Rao
and 5 others ... Respondents/JDRs

NOTICE

To,
3rd Judgement Debtor
Smt. Vegi Satyavathi, W/o. Narasimha Murthy, Aged about 56 years, residing at Amberupuram Village, House No. 3-117/1, Govada Post, Chodavaram, Visakhapatnam-531023.

Whereas the above named petitioner-decree holder has instituted the above E.P. attachment and sale of immovable property belongs to you under Order-21 Rule-54, 64 & 66 C.P.C. for realization of amount mentioned in the execution petition. The said E.P. stands posted to 16-08-2024 in the above named Court.

You are hereby called upon to appear in the above named Court in person or by a pleader on 16-08-2024 at 10-30 A.M. to answer the same failing which the matter will be decided in your absence and disposed of exparte.

DATE OF HEARING : 16-08-2024

PPS ASSOCIATES
Y.SUJATHA, P.MURALI GOPAL, J.V. PREMA SAI
Advocates, D.No. 49-19-20, Lalithanagar,
Visakhapatnam-530016.
Mobile No. 97018 62649/98483 20248/98486 95558